RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ
ఎడిటర్: చెరుకు ఉపేందర్
సోమవారం 7 అక్టోబర్ 2024

సంపుటి: 2
సంచిక: 147
పేజీలు: 4
వెల: రూ.5/-

ఎవరు అడ్డు వచ్చినా

మూసీ ప్రక్షాళన ఆగదు

ప్రజలు నిరాశ్రయులవుతారని ప్రాజెక్టులు కట్టకుండా ఉంటారా: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సూర్యుడు): ఎవరు అడ్డుపడినా మూసీ ప్రక్షాళన ఆగదని మరోసారి తేల్చిచెప్పారు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. మూసీ నిర్వాసితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని స్పష్టం చేశారు. లండన్‌లో థేమ్స్.. అమెరికాలో హడ్సన్ రివర్.. గుజరాత్‌లో సబర్మతి రివర్‌ఫ్రంట్ తరహాలో మూసీని ప్రక్షాళన చేస్తానన్నారు. 'కొలువుల పండుగ' కార్యక్రమంలో 1,635 మందికి నియామక పత్రాలు అందించిన ముఖ్యమంత్రి.. తమ ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వారి హయాంలోనే నిర్మాణం కాబోతున్నాయని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు గంగ, యుమున, సరస్వతి అనే పేర్లతో పాటు మూసీ పేరు కూడా పెట్టే విధంగా ఆ నదిని ప్రక్షాళన చేస్తానని ప్రకటించారు..రేవంత్‌రెడ్డి. ప్రాజెక్టుల కోసం ఇప్పటివరకూ రాష్ట్రంలో భూసేకరణ జరగలేదా? అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో ప్రతిపక్షాలు తమ రాజకీయం కోసం ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. గత ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లు అప్పులు చేసిందన్న రేవంత్.. మరో 10 వేల కోట్లు ఖర్చు చేసి..మూసీ బాధితులను ఆదుకోలేమా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతల పదేళ్ల దోపిడీ బయటపడుతుందన్న భయంతోనే అభివృద్ధి జరగకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు..రేవంత్‌రెడ్డి. ఈటల రాజేందర్ పార్టీ మారినా ఇంకా బీఆర్ఎస్ పక్షానే మాట్లాడుతున్నారని..మండిపడ్డారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు మూసీ ఒడ్డున క్యాట్‌వాక్ చేయకుండా.. వారం రోజులు అక్కడే నివసిస్తే అక్కడి ప్రజల ఇబ్బందులు తెలుస్తాయని

..మిగతా 2లో

నేత్రపర్వంగా శ్రీవారి

బ్రహ్మోత్సవాలు

బకాసుర వధ అలంకారంలో దర్శనమిచ్చిన తిరుమలేశుడు

తిరుమల, అక్టోబర్ 6 (ప్రభాత సూర్యుడు): శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో మూడోరోజు ఆదివారం రాత్రి మలయప్పస్వామివారు శ్రీదేవి, భూదేవితో కలిసి బకాసుర వధ అలంకారంలో దర్శనమిచ్చారు. మాడ వీధుల్లో అంగరంగ వైభవంగా జరిగిన వాహనసేవలో వివిధ కళాబృందాల ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని వాహనసేవలో దర్శించుకున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో మూడోరోజు రాత్రి మలయప్పస్వామివారు ముత్యపుపందిరి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. జ్యోతిషశాస్త్రం చంద్రునికి ప్రతీకగా ముత్యాలను తెలియజేస్తుంది. శ్రీకృష్ణుడు ముక్కుపై, మెడలో ముత్యాల ఆభరణాలు ధరించినట్టు పురాణాల్లో ఉంది. ఆదిశేషుని పడగలను ముత్యాల గొడుగా పూనిన స్వామివారిని దర్శించినా, స్తోత్రం చేసినా సకల శుభాలు కలుగుతాయని పురాణ ప్రశస్తి. చల్లని ముత్యాలకింద నిలిచిన శ్రీనివాసుని దర్శనం తాపత్రయాలను పోగొట్టి, భక్తుల జీవితాలకు చల్లదనాన్ని సమకూర్చుతుంది. వాహనసేవలో పెద జీయర్‌స్వామి, చినజీయర్‌స్వామి, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీ శ్రీధర్ పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు

2

రేవంత్ రెడ్డికి ఈటల

బహిరంగ లేఖ

3

మావోయిస్టు ముక్త్ భారత్‌కు డెడ్‌లైన్ ఫిక్స్

సీఎంలతో అమిత్ షా దిశానిర్దేశం

హాజరు కానున్న చంద్రబాబు, రేవంత్

న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (ప్రభాత సూర్యుడు): వరుస ఎన్‌కౌంటర్లతో డైలీ హెడ్‌లైన్స్. మావోయిస్టులకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు డెడ్ లైన్స్. అదే ఆపరేషన్ కగార్. టార్గెట్..! మావోయిస్టు ముక్త్ భారత్. డెడ్‌లైన్ 2026. లాస్ట్ ఇయర్.. ఇదే టాపిక్ మీద కేంద్ర హోం మంత్రి అన్ని రాష్ట్రాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. కేలండర్‌లో వన్ ఇయర్ తిరిగేసరికి డజన్ల సంఖ్యలో ఎన్‌కౌంటర్లు జరిగాయి. ముఖ్యంగా దండకారణ్యంలో మావోయిస్టులకు పెట్టని కోటగా ఉన్న అబూజ్‌మడ్ లోకి చొరబడి మరీ నక్సల్స్‌ని లేపేస్తున్నాయి భద్రతా దళాలు. ఇక సోమవారం(అక్టోబర్ 7) మళ్లీ ఢిల్లీలో హోం మంత్రి అమిత్ షా నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మీటింగ్ జరగనుంది. ఈసారి మావోయిస్టుల మీదకు ఏ వ్యూహంతో దూసుకెళ్లనుంది కేంద్రం అన్నదీ హాట్ టాపిక్‌గా మారింది. మావోయిస్టుల అంతం.. తమ పంతం అంటూ డేట్, టైమ్ ఫిక్స్ చేశారు అమిత్ షా. ఈ

..మిగతా 2లో

ఎయిర్ షోలో తొక్కిసలాట

నలుగురు దుర్మరణం

చెన్నై, అక్టోబర్ 6 (ప్రభాత సూర్యుడు): తమిళనాడు రాజధాని చెన్నై మెరీనా బీచ్‌లో నిర్వహించిన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఎయిర్ ప్రదర్శనలో అపశ్రుతి చోటు చేసుకున్నది. పెద్ద ఎత్తున ఎయిర్ షోకు భారీగా తరలివచ్చారు. ఈ క్రమంలో తొక్కిసలాట చోటు చేసుకున్నది. దాంతో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. 230 మందికి గాయపడ్డారు. క్షతగాత్రులకు మూడు ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులను శ్రీని వాసన్ (48), కార్తికేయన్ (34), జాన్ బాబు (56), దినేష్‌గా గుర్తించారు. ఐఏఎఫ్

..మిగతా 2లో

టీమ్ ఇండియా

ఆల్‌రౌండ్ షో

బంగ్లాదేశ్‌తో తొలి టీ20లో గ్రాండ్ విక్టరీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 6 (ప్రభాత సూర్యుడు): టెస్టుల్లో బంగ్లాను మట్టికరిపించిన టీమ్‌ఇండియా, మూడు టీ20ల సిరీస్‌లో కూడా శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తొలి టీ20లో ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చి ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బంగ్లాదేశ్‌ను 19.5 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌట్ చేసిన భారత్ అనంతరం బ్యాటింగ్‌లోనూ అదరగొట్టింది. 128 పరుగుల లక్ష్యాన్ని 11.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (16, 7 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. సంజు శాంసన్

..మిగతా 2లో

అమెరికాలోనూ బతుకమ్మకు

అరుదైన గుర్తింపు

అధికారిక ప్రకటనలిచ్చిన మేయర్లు

తెలంగాణ హెరిటేజ్ వీక్ పేరిట ప్రకటన

అధికారిక ప్రకటనలిచ్చిన మేయర్లు, గవర్నర్లు

హర్షం వ్యక్తంచేసిన తెలంగాణ ఎన్ఆర్ఐలు

న్యూయార్క్, అక్టోబర్ 6 (ప్రభాత సూర్యుడు): హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఇక్కడి ఆడపడుచుల ఔన్నత్యానికి ప్రతీకగా నిలిచే పండుగ బతుకమ్మ. రంగురంగుల పూలనే దేవతలుగా భావించి పూజించే ఈ పండుగను ఏటా తొమ్మిది రోజుల పాటు సందడిగా నిర్వహించుకోవటం తెలిసిందే. విదేశాల్లో స్థిరపడిన తెలంగాణ వాసులూ గత పదేళ్లుగా ఈ పండుగకు వైభవంగా జరుపుకుంటున్నారు. ముఖ్యంగా అమెరికాలో తెలంగాణ వాసులు అధికంగా నివసించే న్యూయార్క్, న్యూ జెర్సీ, టెక్సాస్, చికాగో, నార్త్ కరోలినా, కాలిఫోర్నియా, వర్జినియా,

..మిగతా 2లో

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

టీమ్ ఇండియా ఆల్‌రౌండ్ షో

మొదటి పేజీ తరువాయి...

(29, 19 బంతుల్లో 6 ఫోర్లు) రాణించాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (29బీ 14 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు తనదైన శైలిలో చెలరేగి ఆడాడు. నితీశ్‌కుమార్ రెడ్డి (16) పరుగులు చేయగా.. చివర్లో హార్దిక్ పాండ్య (39బీ 16 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. బంగ్లా జట్టులో మెహిదీ హసన్ మిరాజ్ (35లిబీ 32 బంతుల్లో 3 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ శాంటో (27బీ 25 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. తౌహిద్ హృదయ్ (12), తస్కిన్ అహ్మద్ (12), రిషాద్ హొస్సేన్ (11) పరుగులు చేశారు. మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్ స్కోరుకే పెవిలియన్ బాటపట్టారు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి (3/31), అర్ష్‌దీప్ సింగ్ (3/14) అదరగొట్టారు. మయాంక్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, హార్దిక్ పాండ్య తలో వికెట్ పడగొట్టారు. రెండో టీ20 ఢిల్లీ వేదికగా బుధవారం (అక్టోబర్ 9న) జరగనుంది.

ఎయిర్ షోలో తొక్కిసలాట

మొదటి పేజీ తరువాయి...

92 వార్షికోత్సవం సందర్భంగా ఎయిర్‌షోని ఏర్పాటు చేసింది. దాదాపు 13లక్షల మందికిపైగా జనం రైలు, మెట్రో, కార్లు, బస్సుల ద్వారా మెరీనా బీచ్‌కు చేరుకున్నారు. భారీగా జనం వచ్చిన నేపథ్యంలో లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోనూ నమోదు చేశారు. ఎయిర్ షో ముగిసిన తర్వాత సందర్శకులు తిరిగి వెళ్తున్న సమయంలో పరిస్థితి అదుపు తప్పింది. భారీగా జనం తరలిరావడం, ఉక్కపోతతో పలువురు సొమ్మసిల్లి పడిపోయారు. తీవ్ర రద్దీతో పలువురు కిందపడిపోయారు. దాంతో పలువురు ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు గాయాలకు గురయ్యారు. లక్షలాది మంది తరలిరావడంతో వారిని అదుపు చేయడంతో ట్రాఫిక్ అధికారులు నియంత్రించలేకపోయారు. మెరీనా బీచ్‌లోని ముఖ్యమైన విస్తీర్ణంలో ఉన్న కామరాజ్ సలైలోని మద్రాస్ యూనివర్సిటీ క్యాంపస్‌లోకి పలువురు వెళ్లడంతో రద్దీ స్వల్పంగా తగ్గింది. అయితే, ఎయిర్ షో కోసం చెన్నైలోని మెరీనా బీచ్‌లో కనీసం 10 లక్షల మంది తరలివస్తారని అంచనా వేస్తున్నామని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి బీచ్‌కు జనం రావడం మొదలై.. మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగింది. కార్యక్రమం ముగిసిన తర్వాత అందరూ ఒకేసారి వెళ్లిపోవడం గందరగోళానికి దారి తీసిందని ఓ అధికారి తెలిపారు. దాదాపు 21 సంవత్సరాల తర్వాత చెన్నైలో ఎయిర్ షో నిర్వహించారు. కార్యక్రమానికి వైమానిక దళం, తమిళనాడు అధికారులు విస్తృత ప్రచారం కల్పించారు. పెద్ద ఎత్తున జనం తరలిరావడం.. అందుకు తగ్గ ఏర్పాట్లు చేయకపోవడంతో జనం ఇబ్బందులకు గురయ్యారు. చాలామంది డీహైడ్రేషన్ బారినపడ్డారు. తాగేందుకు కనీసం నీళ్లు కూడా అందుబాటు లేవని.. నీటి కోసం కూడా వెళ్లలేకపోయినట్లు పలువురు పేర్కొన్నారు. మరో వైపు చెన్నైలో పగటిపూట దాదాపు 36డిగ్రీలకుపైగానే ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. మరో వైపు మెట్రోల్లోనూ రద్దీ కనిపించింది. గవర్నమెంట్ ఎస్టేట్ మెట్రో స్టేషన్, చింతాద్రిపేట ఎంఆర్‌టీఎస్ స్టేషన్ తదితర రైల్వేస్టేషన్లలో రద్దీతో జనం ఇబ్బందులకు గురయ్యారు.

బీరుట్‌పై విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్

మొదటి పేజీ తరువాయి...

హెజ్‌బొల్లా లక్ష్యాలపై నిఘా పెట్టినట్టు తెలుస్తోంది. బీరుట్ శివారు ప్రాంతాలపై ఇప్పటి వరకు ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో గత రాత్రి జరిపినవే అత్యంత దారుణమైనవని లెబనాన్‌లో విధులు నిర్వహిస్తున్న పలువురు పాత్రికేయులు పేర్కొన్నారు. బాణసంచాలా మొదలైన దాడులు అంతకంతకూ పెరుగుతూ ఉదయం వరకూ భీకరంగా సాగాయని చెప్పారు. గ్రామాలు ఖాళీ చేయాలని హెచ్చరికలు దక్షిణ లెబనాన్‌లోని 25 గ్రామాల ప్రజలు తమ ఇళ్లను ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ హెచ్చరికలు జారీ చేసిన కొన్ని గంటల్లోనే భీకర దాడులు జరిగినట్టు తెలుస్తోంది. హెజ్‌బొల్లా స్థావరాలకు సమీపంలో ఉన్న వారు తమను తాము ప్రాణాపాయంలోకి పడేసుకున్నట్టేనని ఇజ్రాయెల్ పేర్కొంది. ప్రజలు తిరిగి ఎప్పుడు తమ తమ ఇళ్లకు రావొచ్చనేది చెబుతామని తెలిపింది. ఐడీఎఫ్ హెచ్చరికలతో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. గత రెండు వారాల్లో జరిగిన దాడులతో చాలా చోట్ల శిథిలాలు ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతూ సేఫ్ జోన్‌లకు వెళ్లారు.

కీలక నేతలు హతం

నస్రల్లా సహా కీలక హెజ్‌బొల్లా నేతలను ఇప్పటికే హతమార్చినట్టు ఇజ్రాయెల్ తెలిపింది. తాజాగా హెజ్‌బొల్లా కమాండర్ ఖాదర్ అలీ తవిల్‌ను మట్టుబెట్టినట్టు పేర్కొంది. అక్టోబర్ 7 నాటి ఘటనలకు సోమవారంతో సంవత్సరం పూర్తి కానున్న నేపథ్యంలో దక్షిణ ఇజ్రాయెల్‌లో భద్రతను కట్టుదిట్టం చేసినట్టు అక్కడి అధికారులు తెలిపారు మరోవైపు ఉత్తర లెబనాన్‌లో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో హమాస్ లీడర్ సయిద్ అలీ సహా అతడి కుటుంబం ప్రాణాలు కోల్పోయినట్టు హమాస్ మిలిటెంట్ గ్రూప్ ప్రకటించింది.

ఎవరు అడ్డు వచ్చినా మూసీ ప్రక్షాళన ఆగదు

మొదటి పేజీ తరువాయి...

సూచించారు..రేవంత్‌రెడ్డి. ప్రజలు నిరాశ్రయులు అవుతారని ప్రాజెక్టులు కట్టకుండా ఉంటారా? అని ప్రతి పక్షాలను ప్రశ్నించారు..సీఎం రేవంత్‌రెడ్డి. వీలైతే నిర్వాసితులను ఎలా ఆదుకోవాలో సలహాలు, సూచనలు ఇవ్వాలి తప్ప.. అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదన్నారు.

అమెరికాలోనూ బతుకమ్మకు అరుదైన గుర్తింపు

మొదటి పేజీ తరువాయి...

ఒహాయో, జార్జియా ఫ్లోరిడా, మొదలకు అమెరికా సంయుక్త రాష్ట్రాల్లోనూ ఈ పండుగను ఏటికేడు మరింత సందడిగా జరుపుకుంటున్న సంగతి తెలిసిందే.

కొన్ని ప్రాంతాలలో అధికారిక గుర్తింపు

ఈ క్రమంలోనే తాజాగా అమెరికాలో మన బతుకమ్మ పండుగకు అరుదైన గుర్తింపు లభించింది. అమెరికాలోని కొన్ని రాష్ట్రాలు బతుకమ్మ పండుగను అధికారికంగా గుర్తించి.. వారోత్సవాలను ప్రకటించాయి. దీనిని అధికారికంగా బతుకమ్మ పండగ వారం, తెలంగాణ హెరిటేజ్ వీక్‌గా అమెరికాలోని నార్త్ కరోలినా, జార్జియా, చార్లెట్ నగరం, వర్జీనియా రాష్ట్రాలు తాజాగా ప్రకటించాయి. ఈ మేరకు ఆయా ప్రాంతాల మేయర్, గవర్నర్‌లు అధికార ప్రకటనలు విడుదల చేశారు. కాగా, బతుకమ్మకు గుర్తింపు రావడంపై తెలుగు ఎన్నారైలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మావోయిస్టు ముక్త్ భారత్‌కు డెడ్‌లైన్ ఫిక్స్

మొదటి పేజీ తరువాయి...

హై లెవెల్ మీటింగ్‌తో.. అరణ్యకాండలో ఆఖరి పర్వం మొదలు పెట్టేందుకు సిద్ధమవుతున్నవారు. ఇదే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. మార్గదర్శకత్వంలో ఆపరేషన్ కగార్ అప్రతిహతంగా కొనసాగుతోంది. అడవులను జల్లెడ పట్టేదెలా? మావోయిస్ట్‌లకు ఫుల్‌స్టాప్ పెట్టేదెలా? దీనిపైనే హస్తిన కేంద్రంగా మంత్రాంగం సాగుతోంది. గత ఏడాది అక్టోబర్ ఆరో తేదీన కేంద్ర హోం మంత్రి అమిత్ షా టార్గెట్ ఫిక్స్ చేశారు. సరిగ్గా ఏడాది కల్లా భద్రతాబలగాలు ఈ టార్గెట్‌లో చాలావరకు రీచ్ అయ్యాయి. నక్సలిజం సమస్యపై కేంద్రం తాజాగా మరో సమావేశం నిర్వహిస్తోంది. వామపక్ష తీవ్రవాద నిర్మూలనకు 2026 మార్చిని డెడ్‌లైన్‌గా పెట్టింది. అప్పటికల్లా మావోయిస్టులను పూర్తిగా తుడిచి పెట్టెయ్యలన్న లక్ష్యంతో కేంద్రం ముందుకు సాగుతోంది.

నక్సల్స్ బాధిత రాష్ట్రాల సీఎంలతో భేటీకి చంద్రబాబు, రేవంత్

మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలతో కేంద్రం కీలక సమావేశం నిర్వహించనుంది. మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా భేటీ అవుతారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, జార□ండ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు అవుతున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈ కీలక భేటీలో పాల్గొంటారు. డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులు, కేంద్ర బలగాల అధిపతులు%ొ%ఈ భేటీకి హాజరవుతారు. మార్చి 2026 నాటికి దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని పూర్తిగా రూపుమాపాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న కేంద్రం. ఈ మేరకు రాష్ట్రాలకు అవసరమైన సహాయాన్ని అందజేస్తోంది.

202 మంది మావోయిస్టులు హతం

మావోయిస్టులపై పోరాటంలో రాష్ట్రాలకు సూచనలు, మార్గదర్శకాలు చేస్తోంది కేంద్రం. 2010తో పోల్చితే ఇప్పుడు మావోయిస్టు హింస 72 శాతం తగ్గిందని, మావోయిస్టుల హింస కారణంగా మరణించే వారి సంఖ్య కూడా 86 శాతం తగ్గిందని కేంద్ర హోం శాఖ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు 723 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఇక, పోలీసులు, భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్లలో 202 మంది మావోయిస్టులు హతమయ్యారు. మరో 812 మంది అరెస్ట్ అయ్యారు. ఇక మావోయిస్టుల ప్రభావిత జిల్లాల సంఖ్య సైతం 38కి తగ్గినట్టు కేంద్రం వెల్లడించింది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రోడ్లు, మొబైల్ టవర్లు, ఇతర మౌలిక వసతుల కోసం ప్రత్యేక అభివృద్ధి పథకాలు అమలు చేయడంతో పాటు..14,400 కి.మీ పొడవైన రోడ్ల నిర్మాణం, 6,000 మొబైల్ టవర్ల ఏర్పాటే లక్ష్యంగా ముందుకు వెళుతోంది కేంద్రం.

మావోయిస్టులను హడలెత్తిస్తున్న కోబ్రా దళాలు

1960వ దశకంలో బెంగాల్‌లో మొదలైన నక్సలిజం%ొ%ఆ తర్వాత దేశమంతటా వ్యాపించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా నెత్తుటేరులు పారించింది మావోయిస్టు ఉద్యమం. అయితే ఉమ్మడి ఏపీలో ఏర్పాటు చేసిన గ్రే హౌండ్స్ దళాలు.. మావోయిస్టులను సమర్థవంతంగా ఎదుర్కొన్నాయి. ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్.. గ్రే హౌండ్స్ దళాల సమన్వయంతో మావోయిస్టులు చావు దెబ్బ తిన్నారు. వరుస ఎన్‌కౌంటర్లతో.. ఏపీ, తెలంగాణలో మావోయిస్టులు కనుమరుగైపోయారు. ఎక్కడో ఒకటి అర చోట్ల తప్ప మావోయిస్టుల ఉనికి కూడా కనిపించడం లేదు. ఈ గ్రే హౌండ్స్‌ని స్ఫూర్తిగా తీసుకున్న కేంద్రం.. సీఆర్పీఎఫ్ దళాల నుంచి మెరికల్లాంటి జవాన్లను ఎంపిక చేసి కోబ్రా బెటాలియన్లను రూపొందించింది.

కోబ్రా బెటాలియన్ల సాయంతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, జారండ్, బెంగాల్ రాష్ట్రాలు ప్రస్తుతం మావోయిస్టులపై పోరు సాగిస్తున్నాయి. మొదట్లో ఎన్నో ఎదురుదెబ్బలు తిని, భారీ ప్రాణనష్టాలను చవిచూసిన ఈ దళాలు.. చివరకు విజయం సాధించాయి. గత కొన్నేళ్లలో మావోయిస్టులు ఈ ఎన్‌కౌంటర్ ఆపరేషన్లలో తీవ్రంగా నష్టపోయారు. దానికి బెస్ట్ ఎగ్జాంపుల్ అబూజ్‌మఢ్ అడవుల్లో మావోయిస్టులపై భద్రతా బలగాలు పైచేయి సాధించడమే అంటున్నారు నిపుణులు.

కూలిపోయిన అబూజ్‌మఢ్ కోట

ఒకప్పుడు ఖాకీలు దూరలేని కారడవి. చిట్టడవి మావోయిస్టులకు పెట్టని కోట. అదే బస్తర్ దండకారణ్యం. అందులో ఎంత వెతికినా అంతుచిక్కని అబూజ్‌మఢ్ మహారణ్యం. ఒక్క ముక్కలో చెప్పాలంటే అది మావోయిస్టుల హెడ్‌క్వార్టర్స్. ఒకప్పుడు అక్కడ వాళ్లదే రాజ్యం. అయితే ఇప్పుడు సీన్ రివర్స్ అయింది. ఎర్రకోటలో ఖాకీ తుపాకులు గర్జిస్తున్నాయి. వరుస ఎన్‌కౌంటర్లతో అబూజ్‌మఢ్ నెత్తురోడుతోంది. బస్తర్ మే సవాల్ అంటూ మావోయిస్టులను వాళ్ల అడ్డాలోనే చాలెంజ్ చేసే స్థాయికి బలగాలు వచ్చాయి

అరణ్యకాండలో ఆఖరి పర్వం

తాజాగా ఛత్తీస్‌గఢ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్ దేశంలోనే రెండో పెద్ద ఎన్‌కౌంటర్. అబూజ్‌మఢ్ అడవుల్లో%ొ %.దంతెవాడ, నారాయణపూర్ జిల్లాల సరిహద్దులో మావోయిస్టుల క్యాంప్‌పై %ణ=+% బలగాలు విరుచుకుపడ్డాయి. ఈ భారీ ఎన్‌కౌంటర్‌లో 31మంది మావోయిస్టులు హతమయ్యారు. ఒకప్పుడు మావోయిస్టులకు పెట్టని కోట అబూజ్‌మఢ్ మహారణ్యం. 6 వేల చదరపు కిలోమీటర్లలో విస్తరించి..దేశంలోనే అతి పెద్ద అరణ్యంగా పేరు తెచ్చుకుంది. భద్రతా దళాలు ఒకప్పుడు అబూజ్‌మఢ్‌లో అడుగు పెట్టలేకపోయేవి. ఇప్పుడు అదే అబూజ్‌మఢ్‌లో పైచేయి సాధించాయి బలగాలు. 8 నెలల వ్యవధిలో అబూజ్‌మఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో 188 మంది నక్సల్స్ హతమయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వరుస ఎన్‌కౌంటర్లతో అబూజ్‌మఢ్‌పై బలగాలు పట్టు సాధించాయి. అరణ్యకాండలో ఆఖరి పర్వానికి తెర తీశాయి. మావోయిస్టులపై యుద్ధం చివరి చరణానికి చేరుకుందనే సంకేతాలు వస్తున్నాయి.

ఈ నేపథ్యంలో మరో రెండేళ్లలో మావోయిస్టు ముక్త్ భారత్ చేస్తామంటోంది కేంద్రం. హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలో జరిగే భేటీలో అత్యంత కీలక నిర్ణయాలు తీసుకోబోతున్నారని సమాచారం. మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించే ఆఖరి పోరాటానికి ప్రణాళికను సిద్ధం చేసేలా ఈ సమావేశంలో చర్చిస్తారు. ఆ తర్వాత సమరమే అంటోంది కేంద్రం.

9న సీఎం రేవంత్ చేతుల మీదుగా టీచర్ నియామక పత్రాలు

సీఎస్ శాంతి కుమారి

హైదరాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సూర్యుడు): ఈ నెల తొమ్మిదో తేదీన హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు సీఎం ఏ రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. తొమ్మిదో తేదీ సాయంత్రం నాలుగు గంటలకు జరిగే ఈ కార్యక్రమ ఏర్పాట్లపై సంబంధిత కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లతో ఆమె ఆదివారం సాయంత్రం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ దాదాపు పదివేల మందికి పైగా ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈ నియామక పత్రాలను జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను సంబంధిత జిల్లా కలెక్టర్లు పూర్తి చేశారని చెప్పారు. సోమవారం సాయంత్రంలోగా తుది జాబితాను పాఠశాల విద్యా కమిషనర్ సంబంధిత జిల్లా కలెక్టర్లకు అందజేస్తారని తెలిపారు. ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులందరినీ ఈ నెల తొమ్మిదో తేదీ మధ్యాహ్నం రెండు గంటలలోపే ఎల్బీ. స్టేడియానికి చేరేలా తగు ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్లను శాంతి కుమారి ఆదేశించారు. ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులను హైదరాబాదుకు చేరవేయడానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి బస్సులో ఒక పోలీస్ కానిస్టేబుల్, సమన్వయ అధికారిని నియమించాలని సూచించారు. జిల్లా నుండి వచ్చే బస్సులకు వేదికకు సమీపంలోనే తగు పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు అభ్యర్థులను స్టేడియం సమీపంలోనే దించే విధంగా చర్యలు చేపట్టాలని నగర పోలీస్ కమిషనర్‌కు సూచించారు. నగరంలో వర్షం వచ్చే అవకాశం ఉన్నందున రెయిన్ ప్రూఫ్ షామియానా వేయాలని అన్నారు. ఈ ఉపాధ్యాయ నియామక పత్రాలు అందజేసే కార్యక్రమానికి అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా వచ్చే అవకాశం ఉన్నందున తగు ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతి కుమారి తెలిపారు. స్టేడియంలో అభ్యర్థులకు నియామక పత్రాలు అంద చేసేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, అడిషనల్ డీజీ మహేష్ భగవత్, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు



విజయవాడ, అక్టోబర్ 6 (ప్రభాత సూర్యుడు): అక్టోబర్ 6 (నిఘా న్యూస్) ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. నాలుగో రోజు లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులను అనుగ్రహించారు. ఆదివారం సెలవురోజు కావడంతో జగన్మాతను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం ప్రారంభమైన రద్దీ ఏ సమయంలోనూ తగ్గుముఖం పట్టలేదు. ఉచిత దర్శనాలు, వంద, మూడు వందల రూపాయల దర్శనాలతో సమానంగా ఐదు వందల రూపాయల దర్శనాలు, వీఐపీ, ప్రోటోకాల్ దర్శనాలు కొనసాగడంతో ఇంద్రకీలాద్రి కిటకిటలాడింది. దీంతో స్వయంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన, విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు, ఈవో రామారావు దగ్గరుండి రూ.500ల టికెట్ కొనుగోలు చేసిన భక్తులను ముందుకు నడిపించాల్సి వచ్చింది. ఇందుకోసం అదనపు సిబ్బంది సేవలను కూడా వినియోగించారు. మరోవైపు క్యూలైన్లలో నుంచుని లలితా సహస్రనామ పారాయణాన్ని పఠిస్తూ భక్తులు అమ్మవారి సన్నిధిని చేరుకున్నారు. కోటిసూర్యుల ప్రకాశంతో సమానమైన కాంతి స్వరూపంతో చేతిలో పాశం, అంకుశం, చెరకు విల్లు, పూలబాణాలు ధరించిన జగన్మాత భక్తులను కటాక్షించారు. మరోవైపు దుర్గమ్మ దర్శనానికి సినీ ప్రముఖులు క్యూ కట్టారు. నిర్మాత దిల్‌రాజు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. భక్తులను చల్లగా అనుగ్రహించే జగన్మాత సన్నిధికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా బాలీవుడ్ సినీనటి కాదంబరీ జెత్వానీ కుటుంబ సమేతంగా పూజలు చేశారు. అంతరాలయంలోకి వెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నవరాత్రుల్లో అమ్మవారిని దర్శించుకోవడం చాల సంతోషంగా ఉందని కాదంబరీ జెత్వానీ తెలిపారు. జగన్మాత అనుగ్రహంతో ప్రజలందరి కష్టాలు తీరి అంతా సంతోషంగా ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు. భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం మంచి ఏర్పాట్లు చేసిందన్నారు. ఇతర ఆలయాలు కూడా ఉత్సవాల సమయంలో ఇలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని కాదంబరీ జెత్వానీ ఆకాంక్షించారు. మరోవైపు గత మూడు రోజులూ ఎండలు దంచికొడుతున్నాయి. ఇవాళ కొంత వేడి తగ్గినా ఉక్కపోత అధికంగా ఉండడంతో భక్తులు అవస్థలు పడ్డారు. సాయంత్రానికి చిరుజల్లులు కురవడంతో కాస్త ఉపశమనం లభించింది.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

నెలాఖరులోగా కొత్త రెవెన్యూ చట్టం

గ్రామాల్లో రెవెన్యూ అధికారుల నియామకం

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల సమావేశంలో పొంగులేటి

హైదరాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సూర్యుడు): ఈ నెలాఖరులోగా కొత్త రెవెన్యూ చట్టం-24(ఆర్వోఆర్ యాక్ట్)ను అమల్లోకి తేనున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. రెవెన్యూ ఉద్యోగుల జాబ్ చార్టుల రూపకల్పనకు ప్రత్యేక కమిటీ వేస్తామని చెప్పారు. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసీఆర్‌హెచ్ఆర్డీ)లో ఆదివారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లతో మంత్రి సమావేశమమై మాట్లాడారు. 33 జిల్లాలకు సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లను నియమిస్తామని, ధరణి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో బదిలీ చేసిన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను సొంత స్థానాల్లోకి బదిలీ చేస్తామన్నారు. కొత్త మండలాలు, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఆఫీసులు నిర్మిస్తామని చెప్పారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ మాట్లాడుతూ తొమ్మిది నెలల్లో 3.50 లక్షల ధరణి సమస్యలు పరిష్కరించామని తెలిపారు. దసరాలోగా ఎన్నికల తహసీల్దార్లను సొంత స్థానాల్లోకి ట్రాన్స్‌ఫర్ చేస్తామని చెప్పారు. రవీందర్‌రెడ్డి, గౌతమ్‌కుమార్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డికి ఈటల లేఖ

హైడ్రాకు వ్యతిరేకం కాదంటూ..

హైదరాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సూర్యుడు): సీఎం రేవంత్ రెడ్డికి మాల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ లేఖ రాశారు. ఆ లేఖలో పలు విషయాలను ఆయన ప్రస్తావించారు. 'అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా పేదల అభ్యున్నతే లక్ష్యంగా కొట్లాడే వ్యక్తిని నేను. హైడ్రా సంస్థకు, హైదరాబాద్ ముంపు గురికాకుండా చూసేందుకు, మూసీ ప్రక్షాళనకు, మూసీని కొబ్బరినీళ్లలా చేసేందుకు, ఎకలాజికల్ బాలన్స్ కాపాడడానికి, విదేశీ పక్షులు రావడానికి, చేపలు పెంచడానికి, పిల్లలు ఈతకొట్టేలా చెరువులు తయారు చేయడానికి నేను వ్యతిరేకం కాదు. చెరువు కన్నతల్లి లాంటిది. కానీ హైదరాబాద్ లో ఉన్న ఏ చెరువు కూడా పక్షులు, చేపలకు నిలయంలా లేదు. వాటి నుంచి తీవ్ర దుర్వాసన వస్తుంది. చుట్టుపక్కల ప్రజల రోగాలకు నిలయమైంది. ముందు ఈ చెరువుల్లో దుర్గంధాన్ని తొలగించండి. అది చేయకుండా 40 ఏళ్ళక్రితం ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూముల్లో, ప్రభుత్వం అనుమతించిన లే అవుట్ లలో ఇల్లు కట్టుకున్న నిరుపేదప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తూ మీరు చేస్తున్న అడ్డగోలు కూల్చివేతలను వ్యతిరేకిస్తున్నాం. బాధితులు గొల్లున ఏడుస్తున్నా, కాళ్లమీద పడ్డా.. వదిలిపెట్టడడంలేదు. వారు కడుపుకాలి మాట్లాడుతున్నారు. వారికి డబ్బులు ఇస్తే సరిపోదు. పేదల చిరకాల స్వప్నం ఇళ్లు. దొంగలలాగా దాడి చేసి మీరు చేస్తున్న కూల్చివేతలు, ఇస్తున్న నోటీసులు ప్రజల కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. చట్టప్రకారం, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించండి. మీకేమీ అపరిమిత అధికారాలు లేవు అని గుర్తుచేస్తున్నా.పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్ మూసీ ప్రక్షాళన చేస్తానని చేయలేదు. మీరు మూసీ ప్రక్షాళన చేస్తానంటే మేం అడ్డుకోం. పట్టాభూములను కొనుక్కొని ఇల్లు కట్టుకొని ఉంటున్ వారిని బఫర్ జోన్ పేరుతో అక్రమంగా కట్టుకొని ఉంటున్నారని చిత్రీకరించడం దుర్మార్గం. పిడికెడు అక్రమ ఇళ్లను బూచీగా చూపి రూ. కోట్ల విలువ చేసే ఇళ్లను కూలగొడుతున్నారు. %=దీ-శ% అని రాస్తున్నారు. పనిగిరి కాలనీ, మారుతీనగర్, చైతన్య పురి, ప్రజయ్ ఇంజనీరింగ్ సిండికేట్ లాంటి అపార్ట్మెంట్స్ అన్నీ తిరిగివచ్చాం. మేం ప్రజల మధ్య ఉన్నాం. మీకు తిరిగి చూసే టైం లేదు. తిరిగి చూసి.. వారి ఆక్రందనాలను

ఆవిష్కరించే మమ్ముల్ని కాలకేయులుగా పోలుస్తున్నారు. ఇదేనా మీ భాష మీ సంస్కారం.? బ్యూటిఫికేశన్ పేరిట మాల్స్ కట్టి పెద్దలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తావా? మూసీ ప్రక్షాళనకి మీ యాక్షన్ ప్లాన్ ఏంటి? డీపీఆర్ ఉందా? ఇళ్ళు కోల్పోతున్న వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఏంటి ? రూ. కోట్లవిలువ చేసే ఇల్లు తీసుకొని డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తా అంటే ఎలా? సబర్మతి నది ప్రక్షాళనకి రూ. 2 వేల కోట్లు, నమోగంగా ప్రాజెక్టుకు 12 ఏళ్లలో రూ. 22 వేల కోట్లు ఖర్చు పెడితే మూసీ ప్రక్షాళనకు రూ. లక్షా 50 వేల కోట్లు ఎందుకు ఖర్చు అవుతున్నాయి? ఈ ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ ఎవరికి ఇచ్చారు ? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానం చెప్పాలి.చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ జోన్ నిర్ధారించకుండా కూల్చివేతలు ఎలా చేస్తారు?. పట్టా భూముల్లో ఇళ్లు కట్టుకున్నవారికి ప్రత్యామ్నాయం ఏం చూపిస్తారో చెప్పండి. మీరు చేస్తున్న పనులు హైదరాబాద్ భవిష్యత్తుని, అభివృద్ధిని ప్రశ్నార్థకంలో పడేస్తున్నాయి. స్టేజీల మీద ప్రకటనలు చేయడం కాకుండా.. నిర్ణయాధికారం ఉన్న ముఖ్యమంత్రి అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం పెడితే మేము ఎక్కడికైనా రావడానికి సిద్ధంగా ఉన్నాం. నా కొట్లాట రూపాయి రూపాయి కూడబెట్టి కట్టుకున్న పేదల ఇళ్ళకోసమే. మీరు లక్షన్నర రూ. కోట్లు పెట్టే ఖర్చు పేదల కోసమేనా ? అంత బడ్జెట్ మతలబు ఏంటో తేలాల్సిఉంది. ఈ విషయాలపై స్పష్టత వచ్చే వరకు నా ప్రతిఘటన ఉంటుంది. పదవి ఉన్నా లేకున్నా నేను ప్రజల పక్షాన ఉండేవాడిని అని తెలంగాణ సమాజానికి తెలుసు' అంటూ ఈటల ఆ లేఖలో పేర్కొన్నారు.

కొండా సురేఖపై హైకమాండ్ సీరియస్

మంత్రి పోస్ట్ ఊస్ట్?... టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ క్లారిటీ

హైదరాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సూర్యుడు): తెలంగాణలో మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు అటు రాష్ట్ర రాజకీయాల్లో ఇటు తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రకంపనలు రేపిన సంగతి తెలిసిందే. నాగచైతన్య, సమంత విడాకులకు సంబంధించిన అంశాన్ని ప్రస్తావిస్తూ.. అటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీద.. ఇటు అక్కినేని కుటుంబం మీద కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేయటం తీవ్ర దూమారం రేపాయి. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను అటు రాజకీయ నేతలు, ఇటు సినీ ప్రముఖులు ముక్తకంఠంతో ఖండించారు. అసలే హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వంపై సామాన్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్న నేపథ్యంలో.. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు పార్టీకి మరింత డ్యామేజ్ చేసేలా ఉన్నాయని భావించిన అధిష్ఠానం.. ఆ చేసిన ఆరోపణలపై వివరణ అడిగినట్టుగా వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే.. కొండా సురేఖ వ్యాఖ్యలపై ఏఐసీసీ వివరణ అడిగిందంటూ వస్తున్న వార్తలపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఆదివారం (అక్టోబర్ 06న) రోజున గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడిన మహేష్ కుమార్ గౌడ్.. కొండా సురేఖ వ్యాఖ్యలపై ఏఐసీసీ ఎలాంటి వివరణ అడగలేదని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కొండా సురేఖపై ఏఐసీసీ సీరియస్ అయిందని.. మంత్రి స్థానం నుంచి ఆమెను తొలిగించనున్నారంటూ అంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదని చెప్పుకొచ్చారు. కొండా సురేఖ.. స్వయంగా తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవటంతో అప్పుడే వివాదం ముగిసిపోయిందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. పార్టీలోనూ ఎలాంటి చర్చ లేదన్నారు. అయితే.. ప్రతిపక్ష పార్టీకి అనుకూలంగా ఉండే సోషల్ మీడియా మాత్రం కావాలనే మంత్రి కొండా సురేఖ మీద బురద జల్లే ప్రయత్నం చేస్తుందని మహేష్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. ఇప్పటికైనా ఆ పద్ధతి మానుకోవాలని హితవు పలికారు. మరోవైపు.. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం కార్యకర్తలంతా అలర్ట్‌గా ఉండాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. క్షేత్రస్థాయిలో గెలిచినప్పుడే.. కార్యకర్తలకు గానీ, పార్టీ జెండాకు గానీ అసలైన గౌరవం లభిస్తుందని తెలిపారు. పార్టీ కోసం కష్టపడిన నాయకులను దగ్గరుండి గెలిపించుకుంటామన్నారు. ఎవరూ అధైర్యపడొద్దని సూచించారు. రాబోయే రోజుల్లో దేశమంతా కాంగ్రెస్‌దే హవా ఉంటుందని వ్యాఖ్యానించారు. హర్యానాలోనూ కాంగ్రెస్ జెండా ఎగురవేయబోతుందని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావడం ఖాయమని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

ఆర్ అండ్ బి రోడ్డు పక్కన హ్యాండ్ బోరుని రిపేరు చేయించండి

కల్లూరు-ప్రభాత సూర్యుడు మండల పరిధిలో పేరువంచ గ్రామ పంచాయతీ ఎన్టీఆర్ కాలనీ లో త్రాగు నీటికి ఇబ్బంది పడుతున్న కాలనీ వాసులు. కాలనీ కుటుంబాలు త్రాగు నీటి నిమిత్తము నూతనంగా చేతి పంపు మంజూరు చేయించి కొత్త బోరు వేయించి త్రాగు నీటి సమస్యలు తీర్చాలని ఎన్టీఆర్ కాలనీ ప్రజలు వేడుకుంటున్నారు. ఆర్ అండ్ బి రోడ్డు పక్కనే మరమ్మత్తులుకు నోచుకోని చేతి బోరు ను రిపేరు చేయించాలని పలువురు విన్నవించుకున్నారు. అట్టి బోరు ను రిపేరు చేసి నీళ్ళను స్థానికులు వాడుకునేల చేయవలసిందిగా కోరటం జరిగింది. పంచాయితీ కార్యదర్శి రూరల్ వాటర్ సప్లై వాళ్ళు తో మరియు కల్లూరు ఎంపీడీఓ తో మాట్లాడి ఎన్టీఆర్ కాలనీ లో త్రాగు నీటి కోసం నూతనంగా చేతి పంపు మంజూరు చేయించి కొత్తది ఒకటి వేయించాలి. అలాగే బోర్ మెకానిక్ మరియు పంచాయతీ సిబ్బంది సహకారంతో ఆర్ అండ్ బి రోడ్డు పక్కనే ఉన్న పాత హ్యాండ్ బోరును బాగుచేసి వాడుకలోకి తీసుకుని రావాలి అనీ ఎన్టీఆర్ కాలనీ వాసులు కోరుకుంటూన్నారు.

పాకాల రమేష్ (టీచర్)ని పరామర్శించిన కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

కల్లూరు -ప్రభాత సూర్యుడు: మండలంలో గల బొమ్మరిల్లు కి చెందిన పాకాల రమేష్ (టీచర్) ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హాస్పటల్ నుండి తన నివాసానికి చేరుకున్నారు.వారి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని పరామర్శించిన జిల్లా నాయకులు పసుమర్తి చందర్రావు, కల్లూరు మండల నాయకులు ఏనుగు సత్యం బాబు, పెద్ద బోయిన శ్రీనివాసరావు, టిడిపి నాయకులు కాకర్లపల్లి రంగా రావు, పోట్రు సత్యం. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ మండల నాయకులు నోటి కృష్ణారెడ్డి, పొన్నూరు వెంకటేశ్వరరావు ,తోట సుబ్బారావు, ప్రవీణ్ కుమార్, మరియు కల్లూరు మండల నాయకులు,గ్రామ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

AISF
AISF
AISF
AISF

విద్యార్థుల సమస్యలపై ఐకమత్యంగా పోరాడాలి

సిపిఐ నాయకులు ఆందోజు రవీంద్ర చారి

ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

అబ్దుల్లాపూర్ మెట్ - ప్రభాత సూర్యుడు విద్యార్థులు చదువుతోపాటు విద్యార్థుల సమస్యలపై ఐకమత్యంగా పోరాడాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి పిలుపునిచ్చారు. అబ్దుల్లాపూర్ మెట్ మండలం రావి నారాయణరెడ్డి కాలనీ లోని పార్టీ కార్యాలయంలో అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అబ్దుల్లాపూర్ మెట్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి, కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్ గౌడ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భగత్ సింగ్ ను ఆదర్శంగా తీసుకొని విద్యారంగ సమస్యలను పరిష్కరించేలా పోరాటాలు చేయాలని అన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా విధానాలను వ్యతిరేకించాలని నాణ్యమైన విద్య కోసం ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు.ఏఐఎస్ఎఫ్ నూతన కమిటీ సభ్యులు, మండల కార్యదర్శిగా చింత వెంకటేష్, అధ్యక్షులుగా భూక్యా వినోద్, ఉపాధ్యక్షులుగా వట్టి కార్తీక్ రెడ్డి, గర్ల్స్ కన్వీనర్ గా కాటి శ్రావణి, కో - కన్వీనర్ గా చెంచేటి జ్యోష్ణ, సహాయ కార్యదర్శిగా వి. సత్యం, కోశాధికారిగా అల్లెంకి అఖిల, కార్యవర్గ సభ్యులుగా ఎన్. భాను ప్రకాష్, ఐ. భాను ప్రకాష్, చందు, అరవింద్, నరేష్, నవీన్, రాఘవతో పాటు 10 మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గౌడన్నలకు కాటమయ్య కిట్లు పంపిణి చేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే

పెనుబల్లి -ప్రభాత సూర్యుడు : మండల పరిధిలో మండలపాడు గ్రామ పంచాయతీ మొండికుంట లో తెలంగాణ ప్రభుత్వం గౌడ్ అన్నల కొరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం కాటమయ్య కిట్టు లో భాగంగా సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సంకల్పంతో సత్తుపల్లి ఎక్సైజ్ శాఖ వారి ఆధ్వర్యంలో పెనుబల్లి మండలం మొండికుంట గ్రామం లో ఈరోజు నిపుణుల చేత కాటమయ్య కిట్టు ఎలా ఉపయోగించాలో మన గౌడన్నా లకు వివరించి శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ కొరకు పేరువంచ గ్రామం నుంచి ఎంపిక అయినా కొనాకళ్ల రాంబాబు శిక్షణ కొరకు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ యూవ నాయకులు పరిమి భరత్ మరియు మట్టా రామకృష్ణ, గౌడన్న లు మరియు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

రూ.1,800 కోట్లకు పైగా విలువైన డ్రగ్స్ స్వాధీనం

భోపాల్-ప్రభాత సూర్యుడు : డ్రగ్స్ తయారు చేస్తున్న ఫ్యాక్టరీపై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ), యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు రైడ్ చేశారు. రూ. 1,800 కోట్లకుపైగా విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అధికారులు అరెస్ట్ చేశారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఈ సంఘటన జరిగింది. భోపాల్ సమీపంలోని ఫ్యాక్టరీలో మత్తు పదార్థాలు తయారు చేస్తున్నట్లు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో గుజరాత్‌కు చెందిన యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్)తో కలిసి సంయుక్తంగా ఆ ఫ్యాక్టరీపై రైడ్ చేశారు. ఆ ఫ్యాక్టరీలో తయారు చేస్తున్న ఎండీ (మెఫెడ్రోన్) డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఫ్యాక్టరీలో అక్రమంగా మత్తు పదార్థాలు ఉత్పత్తి చేస్తున్న ఇద్దరు నిందితులను అధికారులు అరెస్ట్ చేశారు. కాగా, గుజరాత్ హోం శాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘ్వీ ఈ విషయాన్ని ఎక్స్‌లో పేర్కొన్నారు. ఈ రైడ్‌కు సంబంధించిన ఫొటోలను కూడా అందులో పోస్ట్ చేశారు. డ్రగ్స్‌పై పోరాటంలో భారీ విజయం సాధించిన గుజరాత్ ఏటీఎస్, ఢిల్లీ ఎన్సీబీని ఆయన అభినందించారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

5 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

దసరా ముందురోజు భూమి పూజ.. డిప్యూటీ సీఎం భట్టి వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సూర్యుడు): ఈ సంవత్సరం 5వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ సూళ్లను నిర్మించనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దసరాకు ముందురోజు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణ మానవ వనరులు ప్రపంచంతో పోటీపడేలా విద్యపై దృష్టి పెడతామని చెప్పారు. 20 నుంచి 25 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో స్కూళ్లను నిర్మించి ఇక్కడ 12వ తరగతి వరకు విద్యార్థులకు బోధిస్తామని వెల్లడించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని భట్టి ఆదివారం సచివాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఒక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ సూల్ నిర్మిస్తామని, ఇప్పటివరకు 25 నియోజకవర్గాల నుంచి స్థలాలను సేకరించి పైలట్ ప్రాజెక్టు కింద కార్యక్రమాన్ని ప్రకటిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,023 రెసిడెన్షియల్ పాఠశాలు, ఉండగా ఇందులో 662 అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని తెలిపారు. అన్నివర్గాల విద్యార్థులు కలిసి ఒకచోట ఓ కుటుంబంలా చదువుకొనేలా స్కూళ్ల భవనాలు నిర్మించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల దిల్లీ పర్యటనకు సీఎం

ప్రధాని మోదీ, వివిధ శాఖల మంత్రులతో భేటీ కానున్న చంద్రబాబు

అమరావతి, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు): ముఖ్యమంత్రి చంద్రబాబు దిల్లీ పర్యటన ఖారురు అయ్యింది. సోమవారం, మంగళవారం రెండ్రోజుల పాటు దేశరాజధానిలో పర్యటించనున్నారు. ప్రధాని మోదీ సహా వివిధ శాఖల కేంద్ర మంత్రులతో కీలక అంశాలపై సమావేశం కానున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటల 30 నిమిషాలకు ప్రధాని మోదీతో సీఎం భేటీ కానున్నట్లు సీఎంఓ వర్గాలు వెల్లడించాయి. ఆ తర్వాత రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం అవనున్నారు. మంగళవారం హోంమంత్రి అమిత్ షా, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అవుతారు. బుడమేరు వరదలై నివేదిక ఇచ్చాక సీఎం చంద్రబాబు తొలిసారి ప్రధానిని కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. రైల్వే జోన్, సెయిల్‌లో విశాఖ ఉక్కు విలీనం, వరద నిధులపై చర్చ ఉన్నట్లు తెలుస్తోంది. ప్రపంచ బ్యాంకు నిధుల విడుదలలో ఆటంకం లేకుండా చూడాలని సీఎం కోరనున్నట్లు సమాచారం. పోలవరం నిర్మాణానికి నిధుల విడుదలపైనా చర్చించే అవకాశం ఉంది. దిల్లీ వెళ్లిన ప్రతిసారీ రాష్ట్రానికి లాభం : చంద్రబాబు దిల్లీ వెళ్లిన ప్రతిసారీ రాష్ట్రానికి లాభం జరుగుతోందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. త్వరలోనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని వెల్లడించారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నట్లు సీఎం ఇప్పటికే ప్రకటించినట్లు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం వినుకొండ, పల్నాడు ప్రాంతాలు అభివృద్ధి చేయాలని సంకల్పించిందని తెలిపారు. ఇప్పటికే ఆర్టీసీ, రోడ్లు, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వివరించారు. వినుకొండ-గుంటూరు హైవేను 4 వరుసలుగా విస్తరిస్తామన్నారు. వినుకొండ-గుంటూరు 90 కి.మీ. రోడ్డుకు రూ.2,360 కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబుతో కిరణ్‌కుమార్‌రెడ్డి భేటీ : చంద్రబాబుతో మాజీ సీఎం, బీజేపీ నేత కిరణ్‌కుమార్‌రెడ్డి భేటీ అయ్యారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసంలో ఇరువురు నేతలు భేటీ అయ్యి సుమారు అర గంటపాటు చర్చించుకున్నారు. అయితే ఇటీవల కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కిరణ్‌కుమార్‌రెడ్డి కలిసిన విషయం తెలిసిందే.

ఏపీలో వరద బాధితులకు బిగ్ రిలీఫ్

పరిహారం అందనివారికి సోమవారం జమ
బ్యాంకు ఖాతాల్లో జమచేయనున్న అధికారులు

అమరావతి, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు): ఏపీలో వరద పరిహారం ఇంకా అందనివారికి బిగ్ రిలీఫ్.. వివిధ కారణాల వలన వరద పరిహారం అందని వారికి సోమవారం పరిహారం పంపిణీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. వరదల కారణంగా సుమారు నాలుగు లక్షల మంది ప్రభావితులయ్యారనే అంచనాతో ప్రభుత్వం వరద పరిహారం విడుదల చేసింది. మొత్తం రూ.602 కోట్లు విడుదల చేయగా.. ఇప్పటికే చాలా మందికి వారి బ్యాంకు ఖాతాల్లో పరిహారం మొత్తం జమైంది. అర్హులైన వారిలో ఇప్పటి వరకూ 98 శాతం మందికి పరిహారం జమ చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. మిగతా రెండు శాతం మందికి కూడా వివిధ కారణాలతో పరిహారం అందలేదని.. వారికి సోమవారం అందిస్తామని అధికారులు తెలిపారు. మరోవైపు వరద బాధితులకు పరిహారం అందించేందుకు ఏపీ ప్రభుత్వం రూ.602 కోట్లు విడుదల చేసిన సంగతి తెలిసిందే. అందులో రూ.18.69 కోట్లు మాత్రమే ప్రస్తుతం మిగిలి ఉంది. బ్యాంకు ఖాతాల అనుసంధానం సహా ఇతరత్రా సాంకేతిక కారణాలతో రెండు శాతం మంది.. అంటే 21,768 మంది బాధితులకు పరిహారం సొమ్ము జమ కాలేదు. ఈ నేపథ్యంలో వారి ఖాతాల్లో సోమవారం పరిహారం సొమ్ము జమచేస్తారు. ఈ బాధ్యతను ప్రభుత్వం స్థానిక కలెక్టర్లకు అప్పగించింది. 21,768 మంది బాధితుల్లో ఎన్టీఆర్ జిల్లాలో 15 వేలమంది, అల్లూరి జిల్లాలో 4,620 మంది సహా ఇతర జిల్లాలలో ఉన్నారు. వారికి జిల్లా అధికారులు బ్యాంకు అకౌంట్లలో డబ్బు జమ చేస్తారు. మరోవైపు విజయవాడ వరదల కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో భారీగా నష్టం జరిగింది. ప్రాణనష్టంతో పాటుగా భారీ మొత్తంలో ఆస్తి, పంట నష్టం జరిగింది. ఇక వరదల కారణంగా సర్వస్వం కోల్పోయిన వారికి అండగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బాధితులకు పరిహారం ప్యాకేజీ ప్రకటించింది. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటూ వరదనీటిలో మునిగిపోయిన కుటుంబాలకు రూ.25 వేలు, ఫస్ట్ ఫ్లోర్‌లో ఉంటున్న వారికి రూ.10 వేలు చొప్పున పరిహారం ప్రకటించారు. అలాగే వరదల్లో చనిపోయిన కోళ్లు, పశువులుకు, వ్యాపారులకు సైతం పరిహారం ప్రకటించారు. ఇందులో భాగంగా ఇప్పటికే అర్హులైన వారి జాబితాను ప్రదర్శించి.. వారి అకౌంట్లలోకి డబ్బులు జమచేశారు. తాజాగా ఆధార్ అనుసంధానం సహా ఇతరత్రా సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన వారికి జమ చేస్తారు.

హైడ్రా వర్సెస్ జీహెచ్‌ఎంసీ

హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి మధ్య ఆధిపత్య పోరు
హైడ్రా తీరుపై బల్దియా ఉద్యోగుల మండిపాటు..
వెనక్కి రాని కార్పొరేషన్ అధికారులు
చర్యలకు సిద్ధమైన గ్రేటర్ కమిషనర్.. జీతాలు ఆపాలంటూ ఫైనాన్స్ విభాగానికి లేఖ

హైదరాబాద్, అక్టోబర్ 6 (ప్రభాత సూర్యుడు): జీహెచ్‌ఎంసీలో తన మార్క్ పాలన కోసం ఓ అధికారి తాపత్రయ పడుతుంటే, అదే గ్రేటర్ విషయంలో తన పెత్తనం కోసం మరో అధికారి చూపుతున్న అత్యుత్సాహం ఆ ఇద్దరు ఉన్నతాధికారుల మధ్య కోల్డ్‌వార్‌కు దారితీసింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్ (ఐఏఎస్), హైడ్రా కమిషనర్ (ఐపీఎస్) మధ్య అంతర్గత వివాదం చెలరేగింది. హైడ్రా ఏర్పాటయ్యాక జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు కార్పొరేషన్ పనులను వదిలేసి హైడ్రా వెంట తిరుగుతుండటంతో గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలి ఇటీవల కన్నెర్రజేశారు. జవాబుదారీతనం లేకుండా వ్యవహరిస్తే సహించేది లేదంటూ హెచ్చరించారు. హైడ్రా నుంచి రిలీవ్ కావాలంటూ ఉత్తర్వులు వచ్చినా విజిలెన్స్ అధికారులు, సిబ్బంది అక్కడినుంచి రాకపోవడంతో వారిపై చర్యలకు సిద్ధమయ్యారు. ఏకంగా వారి జీతాలను ఆపేయాలంటూ ఫైనాన్స్ విభాగానికి లేఖ పంపారు. అయినా ఉద్యోగులు తమను హైడ్రాలోనే ఉంచాలంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు అభ్యర్థనలు పెట్టుకోవడంతో ఆయన ప్రభుత్వంతో మాట్లాడుతానంటూ హామీ ఇచ్చారు. ఈ వ్యవహారం ఇద్దరు అధికారుల మధ్య వివాదానికి కారణమైంది.

ఇదే సమయంలో జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ కూడా హైడ్రా వ్యవహారంపై వ్యతిరేకంగా ఉండగా, ఎంఐఎంతో పాటు పలు పార్టీల కార్పొరేటర్లు హైడ్రా వ్యవహారశైలిపై కమిషనర్‌కు, మేయర్‌కు ఫిర్యాదు చేశారు. జీహెచ్‌ఎంసీ నుంచి హైడ్రాకు తాత్కాలిక విధుల కోసం వెళ్లిన ఉద్యోగులు అక్కడే ఉండి గ్రేటర్ పనులను అటకెక్కించారని, వారందరినీ వెనక్కిరప్పించాలని కోరారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రధానమైంది కాగా వారంతా హైడ్రాకే పనిచేస్తున్నారని, వారిని వెనక్కి పిలిపించడంతో వివాదం ముదిరింది. సహజంగా ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులు జీహెచ్‌ఎంసీకి రావాల్సి ఉండగా ఇప్పుడు హైడ్రా వద్దకు వెళ్తుండడంతో గ్రేటర్ పాలకమండలి మండిపడుతున్నట్టు తెలిసింది. తమకు ప్రాధాన్యత తగ్గిపోతున్నదని, సిటీలో తమ పరిధిలో ఎక్కడికి వెళ్లినా హైడ్రా మాటే తప్ప జీహెచ్‌ఎంసీ మాటే లేదని కార్పొరేటర్లు చర్చించుకుంటున్నారు.

హైడ్రా ఫిర్యాదులు జీహెచ్‌ఎంసీకి!

ఇక హైడ్రాకు వచ్చిన ఫిర్యాదులను గ్రేటర్‌కు పంపడంతో మరో వివాదం తలెత్తుతున్నది. హైడ్రాకు వచ్చే ఫిర్యాదులపై సమగ్రంగా విచారణ చేయాలని జీహెచ్‌ఎంసీకి హైడ్రా కమిషనర్ లేఖ పంపుతున్నారు. తమ పనులకే సమయం చాలడం లేదంటే మళ్లీ ఈ హైడ్రా ఫిర్యాదుల గోల ఏమిటని గ్రేటర్ అధికారులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని విభాగాల అధికారులు కమిషనర్‌కు పని ఒత్తిడిపై మొర పెట్టుకున్నారు. తాము హైడ్రా వెంట పడితే జీహెచ్‌ఎంసీ పనులన్నీ కుంటుపడుతాయని, ప్రజారోగ్యం, ప్రజాపాలన అటకెక్కుతుందని చెప్పారు.

దీంతో ఇటీవల వచ్చిన మేడికుంట చెరువుకు సంబంధించి ఫిర్యాదుపై కమిషనర్ పెద్దగా స్పందించకపోగా పని ఒత్తిడి కారణంగా పరిశీలనను హోల్డ్‌లో పెట్టారు. హైడ్రాకు కొత్తగా సిబ్బందిని కేటాయించినా ఇంకా జీహెచ్‌ఎంసీపైనే ఒత్తిడి పెంచడంపై బల్దియా కమిషనర్ సీరియస్‌గా ఉన్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అనే విభాగం జీహెచ్‌ఎంసీలో ఒక భాగం కాగా.. ఇప్పుడు మొత్తం గ్రేటర్‌పైనే పెత్తనం చెలాయించాలనుకోవడంపై కమిషనర్‌తో పాటు ఉద్యోగులంతా గుర్రుగా ఉన్నారు.

విజిలెన్స్ ఉద్యోగులపై ఆమ్రపాలి సీరియస్

గ్రేటర్ కమిషనర్ ఆమ్రపాలికి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు మధ్య కోల్డ్‌వార్ తారస్థాయికి చేరినట్టు తెలుస్తున్నది. గ్రేటర్ ఉద్యోగులను హైడ్రాకు బదలాయించిన తర్వాత మళ్లీ వాళ్లను వెనక్కి పంపకుండా రంగనాథ్ చూపించిన అత్యుత్సాహం ఆమ్రపాలి ఆగ్రహానికి కారణమైంది. దీంతో విజిలెన్స్ విభాగం ఉద్యోగుల విషయాన్ని ఆమె చాలా సీరియస్‌గా తీసుకున్నారు. మరోవైపు హైడ్రా వచ్చీ రాగానే ఆక్రమణల పేరిట కూల్చివేతలు మొదలుపెట్టి అందుకు కారణమంటూ టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన చందానగర్ ఏసీపీ రాజ్‌కుమార్, డీసీపీ సుధాన్ష్ పై హైడ్రా కమిషనర్ కేసులు ఫైల్ చేయించారు.

అనుమతులకు సంబంధించి అక్రమ నిర్మాణాలంటూ ఈ కేసులు పెట్టడంతో ఉద్యోగుల్లో కలకలం మొదలైంది. తమ ఉద్యోగుల విషయంలో హైడ్రా కమిషనర్ చేసిన పని పట్ల జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో పాటు ఉద్యోగులంతా అసహనంతో ఉన్నారు. ఐఏఎస్ పాలనలో కొనసాగుతున్న గ్రేటర్ కార్పొరేషన్‌లో తన ప్రాబల్యం చాటుకోవడానికి ఐపీఎస్ రంగనాథ్ చూపిన ఉత్సాహం ఇద్దరి మధ్యా కోల్డ్‌వార్‌కు కారణమైందని ఉద్యోగులు అంటున్నారు.

అందం, డ్రగ్స్ ఆ తర్వాత డబ్బు

విశాఖ హనీ ట్రాప్ కేసులో సంచలన విషయాలు
సమాజంలోని ప్రముఖులే లక్ష్యంగా యువతి మోసాలు

విశాఖ, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు): ప్రేమ, పెళ్లి, స్నేహం ముసుగులో మాయగాళ్లే కాదు కిలేడీలు వలపు వల విసురుతున్నారు. తమ మాటలు నమ్మి దగ్గరైన వారి బలహీనతలను అవకాశం చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. ముందుగా మేసేజ్‌లతో ముగ్గులోకి దించుతారు. ఆ తర్వాత పర్సనల్‌గా కలుద్దామని చెబుతారు. టెంప్ట్ అయి ముందడుగు వేస్తే అందినకాడికి దోచేస్తారు. ఈ కోవలోకే విశాఖ ఘటన వెలుగులోకి రావడంతో ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు.వలపు వలపన్ని పలువురిని మోసం చేసిన ఘటనలో మాయలేడి జాయ్ జమీమాను విశాఖ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు గురించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఈ ఘటనపై మీడియా సమావేశం నిర్వహించిన విశాఖ సీపీ శంఖబ్రత బాగ్చీ కిలేడీ జమీమా ఎత్తుగడలతో పాటు ఇతర కీలక అంశాలను వెల్లడించారు. విదేశాల్లో స్థిరపడిన వారు, సమాజంలోని ప్రముఖులే లక్ష్యంగా నిందితురాలు మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని చెప్పారు. సామాజిక మాధ్యమాలే టార్గెట్ : సామాజిక మాధ్యమాల వేదికగా అమాయకులను బుట్టలో వేసుకుంటున్నారని సీపీ శంఖబ్రత బాగ్చీపేర్కొన్నారు. ఈ జాయ్ హనీట్రాప్ వెనుక పెద్ద రాకెట్ ఉందని అనుమానిస్తున్నట్లు చెప్పారు. తొలుత అందమైన అమ్మాయి ఫొటోలతో యువకులకు ఎర వేస్తారని తెలిపారు. ఆ తర్వాత బాధితులను మత్తు పదార్థాలకు అలవాటు చేస్తారని వివరించారు. ఆ వ్యక్తులు మత్తులోకి జారుకున్న తర్వాత అమ్మాయితో సన్నిహితంగా ఉన్నట్లు ఫొటోలు తీస్తారని సీపీ శంఖబ్రత బాగ్చీ వెల్లడించారు. ముఠా ఆ ఫొటోలను బాధితులకు చూపించి బెదిరిస్తారని సీపీ శంఖబ్రత బాగ్చీ వివరించారు. తమకు అడిగినంతా నగదు ఇవ్వాలని డిమాండ్ చేస్తారని చెప్పారు. దీంతో బాధితులు పరువు పోతుందన్న భయంతో వారు డబ్బులు చెల్లిస్తారని పేర్కొన్నారు. జాయ్ హనీ ట్రాప్‌లో చాలా మంది చిక్కుకున్నారని తెలిపారు. గతంలోనూ ఇదే తరహాలో పలువురిని మోసగించి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు. కానీ వారు బయటకు రావడం లేదన్నారు. విలాసవంతమైన జీవితాన్ని గడిపేందుకు జాయ్ జమీనా ఈ ముఠాతో చేతులు కలిపిందని సీపీ శంఖబ్రత బాగ్చీ తెలియజేశారు. నిందితురాలని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. మిగిలిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.ఈ కేసుపై దర్యాప్తు ముమ్మరం చేసినట్లు వెల్లడించారు. ఈ ముఠా ఇంకా ఎలాంటి నేరాలకు పాల్పడిందో ఆరా తీస్తున్నామని సీపీ శంఖబ్రత బాగ్చీ వెల్లడించారు.

కెనడాలో వెయిటర్ ఉద్యోగాల కోసం..
వేల మంది భారతీయుల క్యూ

మెరిసేదంతా బంగారం కాదని మరోమారు రుజువైంది. విదేశాలకు వెళ్తున్న మనవాళ్లంతా సుఖపడిపోతున్నారని, రాజభోగాలు అనుభవిస్తున్నారని అనుకుంటే అంతకంటే మూరత్వం మరోటి ఉండదని తాజాగా రుజువైంది. కెనడాలోని బ్రాంప్టన్‌లో ఉన్న తందూరి ఫ్లేమ్ రెస్టారెంట్‌లో వెయిటర్, సర్వర్ ఉద్యోగాలకు 3 వేల మంది భారతీయ విద్యార్థులు క్యూ కట్టడం అక్కడి దారుణ పరిస్థితులను కండ్లకు కడుతున్నది. కిలోమీటరు పొడవున్న లైనులో ఉద్యోగార్థులు నిలబడి ఉన్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. 'మేఘ్ అప్‌డేట్స్' ఎక్స్ ఖాతాలో షేర్ చేసిన ఈ వీడియో.. కెనడాలో చదువు, ఉద్యోగాలు కోరుకునే యువతకు ఈ వీడియో కనువిప్పు కలిగిస్తుందన్న చర్చ మొదలైంది. కొత్తగా ప్రారంభించబోయే రెస్టారెంట్ వెయిటర్, సర్వెంట్ జాబ్స్‌కు వేసిన అడ్వైర్టైజ్‌మెంట్‌కు వచ్చిన రెస్పాన్స్ ఇదని అందులో పేర్కొన్నారు. ఎన్నో కలలతో కెనడాకు వెళ్లే భారతీయ విద్యార్థులు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరాన్ని ఈ వీడియో నొక్కి చెప్తున్నది. మాంద్యం తరుముకొస్తున్న వేళ విదేశాలకు వెళ్లకపోవడమే బెటరని కొందరు సలహా ఇస్తున్నారు.

జానీ మాస్టర్‌కు జాతీయ అవార్డు నిలిపివేత

న్యూఢిల్లీ, అక్టోబర్ 4 (ప్రభాత సూర్యుడు): ఇప్పటికే లైంగిక దాడి ఆరోపణలతో అరెస్టయిన ప్రముఖ టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. కేంద్రం గతంలో అతనికి ఇచ్చిన జాతీయ అవార్డును నిలిపివేస్తున్నట్టు అవార్డుల కమిటీ ప్రకటించింది. జానీ మాస్టర్‌పై పోక్సో చట్టం కింద వచ్చిన తీవ్ర ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని 2022లో తిరుచిత్రబలం చిత్రానికి అతనికి ప్రదానం చేసిన ఉత్తమ కొరియోగ్రాఫర్ అవార్డును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు జాతీయ అవార్డుల కమిటీ ప్రకటించింది. అలాగే ఈ నెల 8న న్యూఢిల్లీలో జరిగే 70వ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమం కోసం ఆయనకు పంపిన ఆహ్వానాన్ని కూడా ఉపసంహరించుకుంటున్నట్టు తెలిపింది. కాగా, ఈ అవార్డుల ఫంక్షన్‌కు హాజరవ్వడానికి తనకు బెయిల్ ఇవ్వాలంటూ జానీ మాస్టర్ చేసిన విజ్ఞప్తిని గురువారం సిటీ కోర్టు అంగీకరించి, ఆయనకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Akshaya Printers, H.No:7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin: 501505, Rangareddy District/Hyderabad City, Telangana. Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505, Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215